క్లుప్తంగా

ముక్కంటి సేవలో ఐఏఎస్ అధికారి



ఆలయంలో ఐఏఎస్ అధికారి శ్రీధర్

శ్రీకాళహస్తి: శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్ సెక్రటరీ, ఏపీ పొల్యూషన్ కంట్రోల్‌బోర్డు సెక్రటరీ బి.శ్రీధర్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు ఆశీర్వదించారు. స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఎంజీఎం గ్రూప్స్ చైర్మన్ గుడ్లూరు మల్లికార్జునాయుడు, గుడ్లూరు మయూర్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలో మంగళవారం సీపీఐ ఆవిర్భావ దినోత్సవాన్ని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి కత్తిరవి, పార్టీ మండల కార్యదర్శి కత్తిధర్మయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేస్తున్నట్లు తెలిపారు. సీపీఐ మండల నాయకులు చంద్రమ్మ, పీటర్, మారయ్య, భాస్కర్, చొక్కలింగం, దాసు, శీను, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

త్వరలో బూత్ కమిటీల ఏర్పాటు

వరదయ్యపాళెం: బూత్ కమిటీల ఏర్పాటుకు సన్నద్ధం కావాలని ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కార్యదర్శి బొప్పన శ్రీనివాసులు తెలిపారు. మంగళవారం వరదయ్యపాళెంలో పార్టీ కార్యకర్తలతో నియోజకవర్గ స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. అనంతరం వరదయ్యపాళెంలో ఆప్ పార్టీ సత్యవేడు నియోజకవర్గ కన్వీనర్ మోరుంపల్లి నందిని ఆధ్వర్యంలో ఇంటింటికీ వెళ్లి సామాన్యుడు శంఖారావం కార్యక్రమం కింద కరపత్రాలను అందజేశారు. ఆప్ మండల కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి, స్థానిక నాయకులు షాజహాన్, భాస్కర్ రాయల్, మాచర్ల చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వైభవంగా దత్త జయంతి

తొట్టంబేడు(శ్రీకాళహస్తి) : మండలంలోని రౌతుసూరమాలలో వెలసిన శ్రీదత్తాత్రేయస్వామివారి ఆలయంలో మంగళవారం దత్తజయంతి వేడుకలను భక్తిశ్రద్ధల నడుమ వైభవంగా నిర్వహించారు. దత్తాత్రేయస్వామి మూలవిరాట్టుకు పలు సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం పరిమళభరిత పుష్పమాలికలతో అలంకరించి పూజలు చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు తీర్థప్రసాదాలు అందజేశారు.



విశేష అలంకరణలో దత్తాత్రేయస్వామి

ప్రవాసినికి అభినందన



శ్రీకాళహస్తి: గీతాపారాయణంలో రాష్ట్రస్థాయి పోటీల్లో రెండవ బహుమతి సాధించిన పట్టణానికి చెందిన ప్రవాసినిని మంగళవారం శ్రీకృష్ణ చారిటబుల్ ట్రస్టు వ్యవస్థాపకుడు మునికృష్ణారెడ్డి అభినందించి, భగవద్గీతను అందజేశారు. మునికృష్ణారెడ్డి మాట్లాడుతూ చిన్న వయసు నుంచే భగవద్గీత పారాయణం చేస్తే మేధాశక్తి పెరగడంతోపాటు ఉత్సాహంగా ఉంటారని తెలిపారు.

వైఎస్సార్ బీమా అందజేత

సత్యవేడు: మండల పరిధిలోని రాచపాళెం గ్రామానికి చెందిన కోనయ్య(47) కుటుంబానికి వైఎస్సార్ తక్షణ బీమాను అందజేశారు. సోమవారం రాత్రి అనారోగ్యంతో కోనయ్య మృతి చెందాడు. మంగళవారం సర్పంచ్ రూబెన్, సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ రమేష్ ఆగ్రామానికి వెళ్లి మృతుడి భార్య వెంకటమ్మకు రూ. పదివేలు అందజేశారు. సమాచారం తెలుసుకొన్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మృతుడి కుటుంబసభ్యులను పరామర్శించారు. ప్రభుత్వం తరుపున ఆదుకొంటామని భరోసా ఇచ్చారు. వలంటీర్ భార్గవి పాల్గొన్నారు.

కండలేరులో 13.055టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో మంగళవారం నాటికి 13.055టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్‌రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. హెడ్‌రేగ్యులేటర్ నుంచి సత్యసాయి గంగ కాలువకు 40,పిన్నేరు వాగుకు5, మొదటి బ్రాంచ్ కెనాల్‌కు 5, లోలెవల్ స్లూయిస్ కు10, క్యూసెక్కుల వంతున విడుదల చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సత్యవేడు: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, సత్యవేడు : క్రీడా జ్యోతి ప్రజ్వలనతో ఆడుదాం- ఆంధ్రా పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, వరదయ్యపాళెం: లోగోను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు







ఆటల పండుగ ఆరంభం

- సత్యవేడులో క్రీడా జ్యోతి వెలిగించిన ఎమ్మెల్యే ఆదిమూలం
- ఆడుదాం–ఆంధ్ర పోటీలకు భారీగా రిజిస్ట్రేషన్లు చేసుకున్న యువత

సత్యవేడు: నియోజకవర్గంలో మంగళవారం ఆడుదాం–ఆంధ్ర క్రీడా సంబరాలు పండుగలా ప్రారంభమయ్యాయి. సత్యవేడు బాలుర ఉన్నత పాఠశాలల క్రీడా మైదానంలో ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ముందుగా స్పోర్ట్సు అథారిటీ ఫ్లాగ్, జాతీయ జెండాను ఎగుర వేశారు. క్రీడా జ్యోతిని వెలిగించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో నైపుణ్యం ఉన్న వారిని గుర్తించి, వారిని ప్రోత్సహించి వజ్రాలుగా దేశానికి అందించాలన్నదే సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధ్యేయమని తెలిపారు. క్రీడలతో ఆరోగ్యం, దేహ దారుఢ్యం పెంపొందుతుందని పేర్కొన్నారు. క్రికెట్‌లో క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు చైన్నై సూపర్ కింగ్స్, ఆంధ్రా అసోసియేషన్ సహకారం అందించేందుకు ముందుకు వచ్చాయన్నారు. ఎంపీడీ కె.చంద్రశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్ కుమార్ రెడ్డి, జిల్లా కార్యదర్శి కె.చంద్రశేఖర్ రెడ్డి, సురుటుపల్లె ఆలయ చైర్మన్ బాలాజీ రెడ్డి, నాయకులు రమేష్, సచివాలయ కన్వీనర్ బి.సోమశేఖర్, వైస్ ఎంపీపీ వెంకటరత్నం, వ్యవసాయ కమిటీ చైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి, జిల్లా మహిళా మెంబరు మస్తానీ, మండల యువత అధ్యక్షుడు వంశీ రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంఈటీలు కె.రవి, ఉష, ఈటీపీఆర్డీ ముని రవికుమార్, పీడీలు పాల్గొన్నారు.

క్రీడా రత్నాలను గుర్తించేందుకే..

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఎస్‌పీపీ ఆర్ట్స్ కళాశాల మైదానం, తొట్టంబేడు బాలుర పాఠశాలలో మంగళవారం ఆడుదాం–ఆంధ్ర క్రీడాపోటీలను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్ సీపీ నాయకులరాలు పవిత్రారెడ్డి ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ మరుగున పడిన గ్రామీణ క్రీడాకారులను వెలుగులోకి తెచ్చేందుకే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పోటీలకు శ్రీకారం చుట్టారని తెలిపారు. మున్సిపల్ కమిషన్ రమేష్‌బాబు, వైఎస్సార్ సీపీ నాయకులు ఉన్నం వాసుదేవనాయుడు, మునిరత్నం, తొట్టంబేడు సర్పంచ్ సుబ్బయ్య, మురళీయాదవ్, భాస్కర్, గంగాధరం, వెంకీ, చెంగల్‌రాయులు, రాజేష్, షరీఫ్ తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులతో పవిత్రారెడ్డి

పిచ్చాటూరు మండలంలో..

పిచ్చాటూరు: మండలంలోని పది సచివాలయాల పరిధిలో మంగళవారం ఆడుదాం ఆంధ్ర పోటీలను స్థానిక అధికారులు, ప్రజా ప్రతినిధులు ప్రారంభించారు. పిచ్చాటూరు, పులికుండ్రంలో సర్పంచ్‌లు కేజీ రోస్ రెడ్డి, శ్యామల, ఎంపీటీసీ సభ్యురాలు రాగమ్మ, పులికుండ్రంలో జెడ్పీటీసీ సభ్యురాలు విష్ణుప్రియ, ఎంపీటీసీ సభ్యుడు రమేష్ రాజు, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కేవీ చలపతిరాజు, రాష్ట్ర కార్యదర్శి కేవీ భాస్కర్ నాయుడు ఎంపీడీఓ శ్రీనివాసులు, ఎంఈఓలు హేమమాలినీ, యుగంధర్ రాజు పాల్గొన్నారు. అనంతరం వ్యాయామ ఉపాధ్యాయుల పర్యవేక్షణలో ఆటల పోటీలు నిర్వహించి విజేతలనుఎంపిక చేశారు.

నారాయణవనం మండలంలో..

నారాయణవనం: స్థానిక బాలికల ఉన్నత పాఠశాలలో సచివాలయ, మండల స్థాయి క్రీడలను ఎంపీపీ దివాకర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ప్రోత్సాహం, వసతులు లేక విద్యార్థులు, యువత క్రీడలకు దురమవుతున్నారని అన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రలో క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించి గుర్తింపు తెచ్చుకోవాలని పిలుపునిచ్చారు. మండల కోఆర్డినేటర్ జయప్రకాష్ మాట్లాడుతూ 12 సచివాలయాల పోటీలను పాలమంగళంలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భీమునిచెరువులో సర్పంచ్ మురుగేశం, కొండలచెరువులో పళణిరెడ్డి క్రీడలను ప్రారంభించారు. బాలికల ఉన్నత పాఠశాలలో క్రీడాకారుల పరిచయ కార్యక్రమం అనంతరం ఖోఖో, వాలీబాల్ క్రీడలను ఎంపీపీ దివాకర్‌రెడ్డి ప్రారంభించారు. ఎంపీడీవో కృష్ణమూర్తి, ఏవో గుణశేఖర్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సొరకాయలు, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, ఎంఈవోలు ప్రభాకర్‌రాజు, గోవిందస్వామి, పీడీలు జయప్రకాష్, జయప్రద, సదాశివం, బాబు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడు మండలంలో..

ఏర్పేడు: మండలంలోని కోబాక పంచాయతీ కుప్పయ్యకండ్రిగ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఆడుదాం–ఆంధ్రా క్రీడా పోటీలను ఎంఈఓ–2 దయాకర్‌రావు ప్రారంభించారు. పాపానాయుడుపేట, అంజిమేడు, ఏర్పేడు, ఇసుకతాగేలి, ఎండీపుత్తూరు తదితర గ్రామాల్లో ఆయా సర్పంచ్‌లు లలిత, మోహన్‌రెడ్డి, శివయ్య, గురవమ్మ ఆధ్వర్యంలో పోటీలు ప్రారంభమయ్యాయి. పంచాయతీ కార్యదర్శులు గోవిందయ్య, హరికృష్ణ పాల్గొన్నారు.

వరదయ్యపాళెం మండలంలో..

వరదయ్యపాళెం: మండలంలోని గోవర్ధనపురం హైస్కూల్‌లో ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని మండల పరిషత్ ప్రత్యేక ఆహ్వానితుడు దామోదర్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రభుత్వం క్రీడల ప్రోత్సాహానికి ఆడుదాం ఆంధ్రకు శ్రీకారం చుట్టిందని తెలిపారు. ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అనసూయ మాట్లాడుతూ మండలంలో 172 మంది బాలురు, 122 మంది బాలికలు వివిధ పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని తెలిపారు. ఆడుదాం ఆంధ్ర లోగోను ఆవిష్కరించారు. తహసీల్దార్ గౌరిశంకరరావు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ నాయుడు దయాకర్‌రెడ్డి, వైస్ ఎంపీపీ పద్మావతి, జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్లు, జేసీఎస్ కన్వీనర్ చిన్నా, యూత్ కన్వీనర్ వినోద్ యాదవ్, కో–ఆప్షన్ సభ్యుడు సిద్దిక్, వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ అబ్దుల్, సర్పంచ్ జ్యోతి, ఆడుదాం ఆంధ్ర మండల కో–ఆర్డినేటర్ బందిల కుమార్, పీఈటీలు ముద్దుకృష్ణ, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

బీఎన్‌కండ్రిగ మండలంలో..

బుచ్చినాయుడుకండ్రిగ: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం..ఆంధ్ర క్రీడా పోటీలను ఎంపీడీఓ సాయిలహరి ప్రారంభించి, కిట్లను పంపిణీ చేశారు. మండలంలో 190 మంది వివిధ పోటీలకు రిజిస్ట్రేషన్లు చేసుకున్నారని తెలిపారు.ఎంపీపీ సుబ్బరత్నమ్మ, ఎంఈఓ మునిసుబ్రమణ్యం, వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గుమూడి గురునాథం, సర్పంచ్ వెంకటమ్మ, ఉప సర్పంచ్ మునిరాజా, గ్రామ కార్యదర్శి ఇందిరమ్మ, తదితరులు పాల్గొన్నారు.











బీఎన్‌కండ్రిగ : కిట్ల పంపిణీ, ఏర్పేడు: కుప్పయ్యకండ్రిగలో పోటీలను ప్రారంభిస్తున్న దయాకర్‌రావు, పాపానాయుడుపేటలో బహుమతుల ప్రదానం, నారాయణవనం: మాట్లాడుతున్న ఎంపీపీ దివాకర్‌రెడ్డి, వాలీబాల్ ఆడుతున్న యువకులు

బడుగుల గుండెల్లో వంగవీటి పదిలం

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి
- ఘనంగా వంగవీటి రంగా విగ్రహావిష్కరణ



వంగవీటి మోహనరంగా విగ్రహావిష్కరణలో ఎమ్మెల్యే మధు, అంజూరు శ్రీనివాసులు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మధుసూదన్, వేదికపై ఎమ్మెల్సీ సిపాయి, శ్రీనివాసులు, కోలా ఆనంద్

శ్రీకాళహస్తి: ఒక కులానికే పరిమితం కాకుండా అన్ని వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన నేత వంగవీటి మోహన రంగా అని, ఆయన భౌతికంగా దూరమై 36 సంవత్సరాలు పూర్తవుతున్నా ఇప్పటికీ అందరి గుండెల్లో చిరస్థాయిగా ఉన్నారంటే ఆయన చేసిన సేవలే కారణమని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ పాలక మండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, బలిజ కులస్తులు ఏర్పాటు చేసిన వంగవీటి మోహన్ రంగా విగ్రహాన్ని ఆయన వర్ధంతి సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి, ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాయలసీమలోనే మొట్ట మొదటిగా వంగవీటి మోహనరంగా విగ్రహాన్ని ఎమ్మెల్యేగా తన హయాంలో ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. ప్రజా సేవలో కూడా శ్రీకాళహస్తిలో తన శక్తికి మించి పేద విద్యార్థులకు ఉచితంగా విద్య, వైద్య సహకారాలు అందిస్తున్నానని తెలిపారు. నియోజకవర్గంలో పేదవర్గాల కుటుంబాల్లో ఎవరైనా మరణిస్తే రూ.10వేలు వంతున అందిస్తున్నానని, ముస్లింల పెళ్లిళ్లకు మేనమామ సాంగ్యం కింద పలు కానుకలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. అభివృద్ధిలో శ్రీకాళహస్తి నియోజకవర్గం ముందుండే విధంగా శివం టూ శివం రోడ్డు ఏర్పాటు చేయడంలో, స్వర్ణముఖి నది సుందరీకరణ, గిరిప్రదక్షిణకు రోడ్డు మార్గాన్ని కల్పించడంలో, నాలుగు మాడ వీధుల్లో అండర్‌గ్రౌండ్ కేబుల్ ఏర్పాటు, మాడ వీధుల్లో నంది, సర్పం, సాలె పురుగు, ఏనుగు గుర్తులు తెలిపే విధంగా లైటింగ్ సౌకర్యం, హిందూ శ్మశాన వాటికను రూ.2.5 కోట్లతో అభివృద్ధి చేసే విధంగా సేవా కార్యక్రమాలకు ఇలాంటి మహనీయులే ఆదర్శమన్నారు. విగ్రహావిష్కరణకు ముందుండి ఏర్పాట్లు చేసిన పాలకమండలి చైర్మన్, బలిజ కులస్తులను అభినందించారు. ఈ కూడలికి రంగా సర్కిల్‌గా నామకరణం చేస్తున్నట్లు మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

రంగా ఆశయాలను కొనసాగిద్దాం

ఎమ్మెల్సీ సిపాయి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తాను గతంలో పోటీ చేసినప్పుడు బలిజ సామాజిక వర్గం నుంచే మెజారిటీ ఓట్లు వచ్చాయన్నారు. వంగవీటి మోహన రంగా ఆశయాలను కొనసాగిద్దామని పిలుపునిచ్చారు. అంజూరు తారక శ్రీనివాసులు మాట్లాడుతూ వంగవీటి విగ్రహాన్ని నెలకొల్పేందుకు అనుమతి ఇవ్వాలని ఎమ్మెల్యేను కోరగానే వెంటనే అంగీకరించారని తెలిపారు. నాయకులు కోలా ఆనంద్, ఉప్పు కృష్ణయ్య, పూల కృష్ణమూర్తి, స్వర్ణమూర్తి, కొండుగారి కృష్ణమూర్తి, కండ్రిగ ఉమ, విజయ్, పసుపులేటి విశ్వనాథం, కలపాటి మోహనరావు, పగడాల ప్రతాప్, తుమ్మా శివప్రసాద్, సిద్దులుగారి ప్రసాద్, చింతామణి యానదయ్య, పర్వతాల బాబు, చిరంజీవులు, పగడాల రాజు, పాండు, ముత్యాల పార్థసారథి, మున్నా, జయశ్యామ్, శరవణ, యతిరాజులు, చిన్న, కంఠా ఉదయ్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం చేశారు.

పాడి రైతులకు మిచాంగ్ పరిహారం



పాడి రైతుకు చెక్కును అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం, ఎంపీపీ దివాకర్‌రెడ్డి

నారాయణవనం: మిచాంగ్ తుపాన్ ప్రభావంతో నష్టపోయిన పాడి రైతులకు పరిహార చెక్కును సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం అందజేశారు. మంగళవారం ఉదయం ఎంపీడీవో కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పశువులు, పాడి ఆవులను కోల్పోయిన 9 మంది రైతులకు రూ 1.10 లక్షల విలువైన చెక్కులను అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తుపాన్ ప్రభావంతో నష్టపోయిన ప్రతి ఒక్కరినీ పార్టీలకు, వర్గాలకు, కులాలకతీతంగా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆదుకుంటున్నారని తెలిపారు. అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి ఉన్నతాధికారులకు పంపిన నివేదికల ఆధారంగా ఆర్థిక సాయాన్ని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎంపీపీ దివాకర్‌రెడ్డి, పశుసంవర్ధక శాఖ డీడీ ఉమామహేశ్వరి, ఏడీ ప్రసాద్, మండల పశువైద్యాధికారి కుమార్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సొరకాయలు, జేసీఎస్ కన్వీనర్ కోనేటి బాబు, డీసీసీబీ డైరెక్టర్ ఊరప్ప, వైస్ ఎంపీపీ శివశంకర్, కోఆప్షన్ సభ్యుడు మణిరెడ్డి, కైలాసకోన చైర్మన్ సుబ్రమణ్యం, సర్పంచ్‌లు సాయిరవి, సుబ్రమణ్యంరెడ్డి, ధర్మలింగం, రామ్మూర్తి, నాగూరు, నాయకులు ఏకాంబరం, చొన్నదొరై, అన్నాదొరై, ఏలుమల్లై పాల్గొన్నారు.

వలంటీర్ ‘సబ్ ఇన్‌స్పెక్టర్’కు సన్మానం

సత్యవేడు: పంచాయతీ పరిధిలోని 2వ వార్డు వలంటీర్‌గా ఉంటూ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టుకు ఎంపికైన జి.శోభను ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం మంగళవారం సన్మానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు ఆడ పిల్లలను తప్పక చదివించాలన్నారు. భర్త చనిపోయి నిరుపేద కుటుంబంలో ఉన్నా ఇద్దరు పిల్లలను ఉన్నత చదువులు చదివించిన శోభ తల్లి పారిజాతంను ఎమ్మెల్యే అభినందించారు.నాయకులు కె.సుశీల్‌కుమార్ రెడ్డి, కె.చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎం బాలాజీ రెడ్డి పాల్గొన్నారు.

ఆలయానికి వెండి గిన్నె బహూకరణ



విరాళం అందజేస్తున్న శివప్రసాద్ దంపతులు



వెండిగిన్నెను బహూకరిస్తున్న దాతలు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయానికి మంగళవారం నాయుడుపేటకు చెందిన రాఘవేంద్ర గ్రూప్స్ అధినేత కె.సురేష్, సోదరి లత కలిసి రూ.50వేలు విలువజేసే వెండి గిన్నెను కానుకగా బహూకరించారు. పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులును కలిసి దాన్ని అందజేశారు. దాతలకు స్వామి, అమ్మవార్ల ప్రత్యేక దర్శనం కల్పించారు. అనంతరం వేదపండితులు ఆశీర్వచనం ఇచ్చారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.25,101 విరాళం

శ్రీకాళహస్తీశ్వరస్వామి దేవస్థానం నిత్యాన్నదాన పథకానికి మంగళవారం పట్టణానికి చెందిన ఎస్.శివప్రసాద్ దంపతులు రూ.25,101 విరాళంగా అందజేశారు. ఆలయ అధికారులు దాతలకు కృతజ్ఞతలు తెలిపి, స్వామి అమ్మవార్ల ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు.

శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం



వ్రతంలో పాల్గొన్న భక్తులు

కాణిపాకం(యాదమరి): కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధంగా ఉన్న శ్రీవరదరాజుల స్వామి ఆలయంలో ఆలయ అర్చక వేదపండితులు శాస్త్రోక్తంగా సత్యనారాయణస్వామి వ్రతం నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా శ్రీవరదరాజుల స్వామి ఆలయంలో వెలసిన మూలవిరాట్‌కు ప్రత్యేక అభిషేకాలు అలంకరణలు నిర్వహించి పూజలు చేశారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని ఆలయ అలంకార మండపంలో సత్యనారాయణ స్వామి అవతారంలో కొలువుదీర్చి శాస్త్రోక్తంగా సత్యనారాయణ వ్రతం నిర్వహించారు. భక్తులు హాజరై సత్యనారాయణ వ్రతం ఆచరించారు. వారికి ఆలయ అధికారులు తీర్థ ప్రసాదాలు అందించారు. రాత్రి స్వామి వారు గరుడ వాహనంపై పురవీధులలో ఊరేగారు. భక్తులు స్వామివారికి కర్పూర నీరాజనాలు సమర్పించి, మొక్కులు తీర్చుకున్నారు.

పున్నమి వెన్నెల్లో కల్యాణ వెంకన్న

చంద్రగిరి: శ్రీనివాసమంగాపురంలో వెలసిన శ్రీకల్యాణ వేంకటేశ్వర స్వామి వారు మంగళవారం రాత్రి గరుడ వాహనంపై భక్తులను అనుగ్రహించారు. ధనుర్మాసం పౌర్ణమి సందర్భంగా తెల్లవారుజామున స్వామివారిని తిరుప్పావై సేవతో మేల్కొలిపి నిత్య కైంకర్యాలను నిర్వహించారు. తదుపరి స్వామివారికి అభిషేక సేవను నిర్వహించి, మరకత మాణిక్యాలు, వజ్రవైఢూర్యాలతో శోభాయమానంగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తదుపరి సాయంత్రం ఆలయ ఆవరణలో విద్యుత్ కాంతుల నడుమ స్వామివారికి ఊంజల్ సేవను కనుల పండువగా నిర్వహించారు. అనంతరం గోవిందుడు తనకు ప్రీతి పాత్రమైన గరుడునిపై ఆశీనులై నాలుగు మాడవీధులలో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.



గరుడ వాహనంపై విహరిస్తున్న కల్యాణ వేంకటేశ్వరస్వామి